కోరాడ రామనాయుడుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు కవల సోదరుడు కోరాడ రామనాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి మరణించారు. బుధవారం ఆయన పెద్ద కర్మను నిర్వహించగా వైసీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఈ కార్యక్రమానికి హాజరై ఆయన కోరాడ రామునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ రాంబాబు, జడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ భద్రత నడుమ జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికలు

- 10 మంది సభ్యులు గెలుపు
- జనసేన తీవ్ర అసంతృప్తి
- చేజారిన ఒక స్థానం..దక్కించుకున్న వైసీపీ..
- ఎన్నికల ఫలితాలను వెల్లడించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీలో స్థాయి సంఘం ఎన్నికలు భారీ భద్రత నడుమ ఉత్కంఠ వాతావరణంలో బుధవారం జరిగాయి. ఎన్నికల్లో 8 మంది టిడిపి కార్పొరేటర్లు, ఒక బీజేపీ కార్పొరేటర్, ఒక వైసీపీ కార్పొరేటర్ స్థాయి సంఘం సభ్యులుగా ఎన్నికయ్యారు. పదికి పది స్థానాలు కూటమివే అని చెప్పిన నేతలకు చుక్క ఎదురయింది. ఓ పక్క జనసేన కార్పొరేటర్లు అసంతృప్తి మధ్య కూటమిలో తీవ్ర చిచ్చు మొదలైంది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఓటింగ్ ను బహిష్కరించగా, మరో జనసేన కార్పొరేటర్ సాదిక్ రహస్య ఓటింగ్ విధానానికి తూట్లు పొడిచి ఎన్నికలు నిర్వహించాలని దీనిపై కోర్టుకు వెళ్లి ఈ ఎన్నికను రద్దు చేయాలని కోరుతానని మీడియాకు తెలియజేశారు. మరోపక్క కూటమిలో క్రాస్ వోటింగ్ జరగడంతో 24 వార్డు కార్పొరేటర్ వైసిపి స్థాయి సంఘం అభ్యర్థి సాడి పద్మా రెడ్డి గెలుపొందారు.

ఆఖరి ఏడాది స్థాయి సంఘం ఎన్నికలు కూటమి 10 స్థానాలను కైవసం చేసుకునేందుకు భీమిలిలో ఒక రిసార్ట్‌లో తమ మద్దతుదారు కార్పొరేటర్లు అందర్నీ తరలించి క్యాంప్ నిర్వహించినా ప్రయోజనం దక్కలేదని ప్రచారం సాగింది. మేయర్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు దగ్గరుండి ఈ క్యాంపు పర్యవేక్షించిన ప్రయోజనం దక్కలేదని వైసీపీ నేతలు ఆరోపించారు.

స్థాయి సంఘం సభ్యుల ఎన్నికలలో 10 మంది సభ్యులు ఎన్నికైనట్లు బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగిందని, తదుపరి ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను ప్రకటించడమైనదని కమిషనర్ తెలిపారు. ఈ స్థాయి సంఘం ఎన్నికల్లో 20 మంది సభ్యులు పోటీలో పాల్గొనగా, 92 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఈ పోటీలలో 10 మంది స్థాయి సంఘం సభ్యులుగా ఎన్నికైనట్లు కమిషనర్ తెలిపారు. నీలిమ కొణతాల 58 ఓట్లు, గంకల కవిత 57 ఓట్లు, దాడి వెంకట రామేశ్వరరావు 57 ఓట్లు, మొల్లి హేమలత 57 ఓట్లు, సేనాపతి వసంత 54 ఓట్లు, గేదెల (బంటుబిల్లి) లావణ్య 53 ఓట్లు, మాదంశెట్టి చినతల్లి 52 ఓట్లు, రాపర్తి త్రివేణి వరప్రసాదరావు 52 ఓట్లు , మొల్లి ముత్యాలు 51 ఓట్లు, సాడి పద్మావతి (పద్మా రెడ్డి)లకు 50 ఓట్లు పోలైనట్లు కమిషనర్ తెలిపారు. టిడిపి పార్టీ నుంచి పోటీ చేస్తున్న రైతు శ్రీనివాస్ క్రాస్ ఓటింగ్ వల్ల ఓటమి చూడాల్సి వచ్చింది. ఎన్నికలు ఫలితాలను వెల్లడించి ఎన్నికల్లో గెలుపొందిన వారికి కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్నికైన సభ్యులకు ఎన్నికల్లో గెలుపొందినట్లుగా ధ్రువీకరణ పత్రాలను జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ నేతలపై టీడీపీ గూండాల దాడి తగదు

- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పులివెందులలో వైసీపీ నేతలపై టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్య నారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి సర్కార్ పట్టపగలే పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. నల్లగొండువారి పల్లెలో ప్రభుత్వ అండతో టీడీపీ గూండాలు రెచ్చిపోయారన్నారు. చివరికి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై కూడా దాడికి దిగడం దారుణం అన్నారు. ఒక శాసనమండలి సభ్యుడికి పోలీసులు కనీస భద్రత కల్పించలేరా అని ప్రశ్నించారు. టీడీపీ గూండాల దాడులకు పోలీసులు మద్దతిస్తున్నారా అనే సందేహాన్ని వెలిబుచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామా ? నియంత పాలనలో ఉన్నామా..? అని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు ఈ ఘటనకు బాధ్యత వహించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులివెందుల్లో శాంతి భద్రతలను కాపాడేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనుగోలుదారులతో పూర్ణా మార్కెట్ కిటకిట

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వరలక్ష్మీ వ్రతానికి వచ్చే కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. ముఖ్యంగా పూర్ణ మార్కెట్‌కు వరలక్ష్మి వ్రతం తాకిడి ఎక్కువగా కనిపించింది. బుధవారం మధ్యాహ్నం నుంచే కొనుగోలుదారులు, మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడంతో జగదాంబ నుంచి పూర్ణా మార్కెట్ వరకు విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కనిపించింది. పూర్ణ మార్కెట్ నుంచి టౌన్ కొత్త రోడ్డు, కురుపా మార్కెట్ వరకు గల బంగారం దుకాణాలు కళకళలాడాయి. రోడ్డు పక్కన వున్న చిల్లర వర్తకులు కూడా కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. గంటలకొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, పెద్ద వాహనాలు సైతం సూపర్ బజార్ నుంచి పూర్ణ మార్కెట్ వరకు రోడ్డు మీద నిలిచి పోవడంతో ప్రయాణకులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయలేదు. జగదాంబ కూడలిలో హెల్మెట్, వాహన చలానాలు చెకింగ్‌లు చేస్తూ కనిపించారు. ఈ ట్రాఫిక్ జామ్‌లో అంబులెన్స్ కూడా చిక్కుకోవడం గమనార్హం.

ఎంఐజి లేఅవుట్ పట్టాల పండుగ

ల్యాండ్ పూలింగ్ రైతులకు పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరం కాలంలోనే రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా రామవరం, జీఎస్ అగ్రహారం గ్రామాల ల్యాండ్ పూలింగ్ చేశామని, భూమి స్వాధీనంలో ఉన్న రైతులు ఆనందించేలా యాజ మాన్య హక్కు పట్టాలు అందిస్తున్నామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనంద పురం మండలం రామవరం, జీఎస్ అగ్రహారంలలో లబ్ధిదారులకు ఎల్.పి.ఓ.సి.లను అందజేసే కార్యక్రమానికి బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఇళ్ల పట్టాల అవసరాలకు మండలంలో 2 వేల నుంచి 3 వేల ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. ఎంఐజీ హౌసింగ్ కోసం రామవరం, జీఎస్ అగ్రహారం రైతులందరూ ఏకతాటిపైకి వచ్చి ల్యాండ్ పూలింగ్ కోసం మొత్తం 230 ఎకరాల భూములివ్వడమనేది ప్రశంసనీయమన్నారు. వి.ఎం. ఆర్.డి.ఎ. లే అవుట్ వల్ల చుట్టు పక్కల భూముల ధరలు బాగా పెరుగుతాయని తెలిపారు. వైసీపీ హయంలో తంగుడిబిల్లిలో 700 ఎకరాల్లో తాగు నీరు, రోడ్లు, కరెంట్, హాస్పటల్, డ్రైనేజ్ వంటి కనీస మౌలిక వసతులు కల్పించకుండా, సెంటు భూముల్లో పిచ్చుక గూళ్ల లాంటి ఇళ్లు నిర్మించారని విమర్శించారు. నియోజకవర్గం పరిధిలోని 7 ఇనాం గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్డీఓ కె. సంగీత్ మాథుర్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల నాగ సందీప్, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, భీమిలి జనసేన నాయకులు సాకరి శ్రీనుబాబు, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, కూటమి నాయకులు సుభాష్ చంద్రబోస్, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి.నాయుడు, శ్రీకాంత్ రాజు, గంద్రెడ్డి సోమినాయుడు, పాండ్రంగి అప్పలరాజు, బలిరెడ్డి మల్లికార్జునరావు, జోగా ముత్యాలు, ఎంపీటీసీ కృష్ణ, లోడల వెంకట్రావు, తమ్మిన అప్పలరాజు, కోరుకొండ మూర్తి, బాలు దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గల్లా

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా జీవీఎంసీ 88వ వార్డు, నరవ గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నాయకుడు గల్లా శ్రీనివాసరావు నియమితులయ్యారు. పెందుర్తి ఎమ్మెల్యే, జనసేన రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు సిఫార్సు మేరకు ప్రభుత్వం శ్రీనివాసరావును మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమించింది. జనసేన పార్టీ సీనియర్ నాయకుడిగా, ఆ పార్టీ మీడియా కోఆర్డినేటర్‌గా ఎన్నో సేవలందించిన గల్లా శ్రీనివాసరావును ఈ పదవికి ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. బుధవారం ఉదయం శ్రీనివాసరావు తన మద్దతుదారులతో కలిసి ఎమ్మెల్యే రమేష్ బాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇల్లపు సురేష్, రాపర్తి కిషోర్, సదరం భీమేష్, బొడ్డు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమక్షంలోనే ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 12వ తేదీన జరిగే నులిపురుగుల(డీ వార్మింగ్ డే) నివారణ దినోత్సవంగా చిన్న పిల్లలకు అందించే ఆల్బెండోజల్ మాత్రలను వైద్యుల సమక్షంలోనే వేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈ నెల 12వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా విశాఖ జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన కన్వర్జెన్స్ కమిటీ సమావేశంలో వివిధ అంశాలపై వైద్యులకు, ఇతర విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. చిన్నారుల ఆరోగ్యంపై దుష్పరిణామాలు చూపే నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ నిర్దేశించారు. అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదివే 1-19 ఏళ్ల వయసు గల బాల, బాలికలకు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు విధిగా ఆల్బండజోల్ మాత్రలు ఉచితంగా అందించాలని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో కవర్ కాని పిల్లలను గుర్తించి ఆగస్టు 20వ తేదీన ప్రత్యేకంగా మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం సంబంధిత గోడ పత్రికను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వర రావు, జిల్లా ఆర్.బి.ఎస్.కె. సమన్వయ కర్త డా.ఎన్.వి.సమత, ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా సమన్వయ కర్త డా.కె.అప్పారావు, జిల్లా గణాంక అధికారి బి.వి.విజయలక్ష్మి, కేజీహెచ్ ఆర్ఎంవో, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిల కోసం ఆందోళన వద్దు

జూట్ మిల్లు సమస్యకు త్వరితగతిన పరిష్కారం

యాజమాన్య, కార్మిక సంఘాల ప్రతినిధులతో గంటా

విశాలాంధ్ర - తగరపువలస: చిట్టివలస జూట్ మిల్లు కార్మికుల పీఎఫ్ బకాయిలు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. విశాఖలో ఎం.వి.పి. కాలనీలోని గంటా నివాసంలో యాజమాన్య, కార్మిక సంఘ ప్రతినిధులు, అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సీనియారిటీని అనుసరించి పెన్షన్ వస్తుందన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇతర బకాయిలు చెల్లించడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని జూట్ మిల్లు యాజమాన్యం తరపున బజోరియా ఎమ్మెల్యేకు తెలియజేశారు. మిల్లు భూముల విలువతో పోల్చుకుంటే కార్మికులకు చెల్లించాల్సింది తక్కువని ఆయన చెప్పారు. బకాయిల మొత్తాన్ని లెక్క గట్టి దానికి రెండు రెట్లు విలువైన భూమిని హామీగా ఉంచుకుని, మిగతా భూమిని అటాచ్ మెంట్ నుంచి తప్పించాలని కోరారు. భూమిని అమ్మితే తప్ప బకాయిలు తీర్చలేనని, తన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు. ఈ ప్రతిపాదనపై కార్మికులతో చర్చించి శనివారానికి తమ అభిప్రాయాలను చెబుతామని ఎమ్మెల్యేకు కార్మిక సంఘాల ప్రతినిధులు తెలియజేశారు. పీఎఫ్ అంశంపై రీజనల్ పీఎఫ్ కమిషనర్ అవినాష్ కుమార్ మాట్లాడుతూ బకాయిలకు మించిన డబ్బు ఖాతాలో ఉందని స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ లేబర్ కమిషనర్ రామా రావు, యాజమాన్యం తరపున బజోరియా, లలిత్, రామ్ కుమార్, కార్మిక సంఘాల తరపున ఏఐటీయూసీ నుంచి పడాల రమణ, రామ పైడి, టీఎన్ టీయూసీ నుంచి నరవ రామారావు, గోడి అచ్చారావు, మద్దాల వెంకట గురుమూర్తి, కార్మిక కాంగ్రెస్ సంఘం తరపున మునకల ఆదినారాయణ, దల్లి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో అర్చకులకు ఘన సత్కారం

విశాలాంధ్ర - పెందుర్తి: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో విజయనగరం సోమస్కంద పీఠంలో అర్చకుల సన్మాన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఉత్తరాంధ్ర పురోహిత మిత్ర వ్యవస్థాపకులు, పెందుర్తి ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మికవేత్త ఏలూరు వెంకట రాజేష్ శర్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 50 మంది వేద పండితులను అర్చకులను బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ పండితుల చేతులమీదుగా ఘనంగా సత్కరించినట్లు ఆయన తెలిపారు. పీఠం అధినేత పులఖండం సంతోష్ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులకు తోడ్పాటు అందించడానికి బ్రాహ్మణ సంక్షేమ వేదిక నిరంతరం కృషి చేయడం అద్భుతమైన విషయమన్నారు. బ్రాహ్మణ సంక్షేమ వేదిక శ్రీకాకుళం వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణిబాబు మాట్లాడుతూ బ్రాహ్మణుల ఐక్యత కోసం రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక ప్రాంతాలలో సమావేశాలు ఏర్పాటు చేసి, అర్చకులను, పురోహితులను ఏకం చేస్తున్న బ్రాహ్మణ సంక్షేమ వేదికకు బ్రాహ్మణులందరు పూర్తి సహాయ సహకారాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీలు నేరళ్ళ మల్లికార్జున, చోడవరపు శ్రీనివాస్, సింహాచలం వర్కింగ్ ప్రెసిడెంట్ ఇరగవరపు వెంకట లక్ష్మీనరసింహం, విశాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అనకాపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ ఏలూరు రాజేష్, ఏలూరి నరసింహారావు దంపతులు, రమేష్ స్పందన, జగన్నాథ శర్మ, గురునాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ నూతన కార్యవర్గానికి పరిమి అభినందన

విశాలాంధ్ర - తగరపువలస: ఇటీవల నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ సభ్యులు చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భీమిలి జనసేన పార్టీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ కార్యదర్శి సందీప్ పంచకర్ల, జనసేన ఒకటో వార్డు అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు రామలక్ష్మి, నాయుడు, తారకేస్, శ్రీను, సత్తిబాబు, రమణ, రమేష్, చిన్న పాల్గొన్నారు.

తీర ప్రాంత భద్రతపై గీతంలో మాక్ డ్రిల్

విశాలాంధ్ర - మధురవాడ: తీర ప్రాంత భద్రతతోపాటు తీవ్రవాదులు చొరబడినప్పుడు అత్యవసర భద్రత పరిస్థితులలో ఎలా స్పందించాలి, సమర్థ వంతమైన రక్షణ చర్యలు ఎలా చేపట్టాలి అవగాహన కలిగించడానికి ఆక్టోపస్ చార్లీ టీమ్ ఆధ్వర్యలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ డ్రిల్‌లో ఆక్టోపస్ కమాండోలు అత్యాధునిక ఆయుధాలతో గీతంలోని పలు భవంతులలో తీవ్రవాదులను గుర్తించి విశ్వ విద్యాలయం సిబ్బందిని రక్షించే విధంగా ఆపరేషన్ నిర్వహించారు. చార్లీటీమ్ ఉన్నతాధికారులు డీఎస్పీలు తిరుపతయ్య, డి.రాంబాబు నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్‌లు ఎస్.శివాజీ, పి.ఎస్.ఎమ్.రెడ్డి, వి.శ్రీనివాసరావు పాల్గొని అత్యవసర పరిస్థితులలో విద్యార్థులు, సిబ్బంది, గీతం భద్రత విభాగం ఏ విధంగా స్పందించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గీతం అధికారులు, గీతం సేఫ్టీ విభాగం అధికారి కె.వి.చక్రధర్, గీతం విజలెన్స్ అండ్ సెక్యూరిటీ గోపి కుమార్, వివిధ విభాగాల అధిపతులు, గీతం సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు దాసుడు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి ఆరాధ్య భక్తుడు లక్ష్మీకాంత్ దాసో నాయక్ (దాసుడు) తన స్వగ్రామమైన పట్టుపురం తిరుగు ప్రయాణం అయ్యారు. ముందుగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం గత ఏడాది నుండి ఇప్పటివరకు తన హుండీలో దాచుకున్న డబ్బులను స్వామివారి హుండీలో వేశారు. ఓం నమో నారాయణనాయ అంటూ తిరుగు పయనం అయ్యారు. కొండక్రింద కార్యనిర్వహణాధికారి వి.త్రినాథ రావును కలసి తనకు తోచిన మర్యాదలు చేసి చిరు మందహాసంతో వెళ్ళొస్తాను అని కార్యనిర్వాహణాధికారితో చెప్పారు. దాసుడు తన బృందంతో ఈ ఏడాది జరిగిన చందన యాత్ర అనంతరం వచ్చి నేటివరకు స్వామివారి సేవలో తరించారు. దర్శన అనంతరం స్వామివారి తులసిని భక్తులకు ప్రసాదంగా వితరణ చేసేవారు. దాసుడు తన ప్రదేశానికి తిరిగి వెళ్ళేటపుడు ఎప్పటి వలే ఆలయంలో విధులు నిర్వహిస్తున్న వారందరికీ కొత్త దుస్తులు, కానుకలు ఇచ్చి వెళ్లారు. అయితే దాసుడు ఉన్నంతకాలం వివిధ జాతుల పుష్పాలతో అలంకరణలో స్వామివారు, గోదాదేవి భక్తులకు వీనుల విందుగా దర్శనం కలిగేది. ఆయన వెళ్ళిన తరువాత అంత అలంకరణ కనిపించదేమో అని భక్తులు, ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఆర్ఎస్ నాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా జనసేన సీనియర్ నాయకుడు, చిరంజీవి అభిమాన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాయవరపు సింహాచలం నాయుడు (ఆర్ఎస్ నాయుడు)ను ప్రభుత్వం నియమించింది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సిఫార్సు మేరకు ఆర్ఎస్ నాయుడును మార్కెట్ కమిటీ సభ్యుడుగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఉదయం సుజాతనగర్ జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే రమేష్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్ఎస్ నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పూలబొకే అందజేసి ధన్యవాదాలు తెలియజేసిన ఆర్ఎస్ నాయుడు, తనకు నియోజకవర్గం స్థాయి పదవి ఇచ్చిన పంచకర్ల రమేష్ బాబుకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆయన అడుగుజాడల్లో నడుస్తానని పేర్కొన్నారు. జీవీఎంసీ 97వ వార్డు పులగాలపాలెంకు చెందిన ఆర్ఎస్ నాయుడు చిన్నప్పటి నుండి చిరంజీవి, పవన్ కళ్యాణ్ అంటే విపరీతమైన అభిమానం. చిరంజీవి అభిమాన సంఘం ఉత్తరాంధ్ర జాయింట్ సెక్రటరీగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పెందుర్తి నియోజకవర్గంలో ఆ పార్టీ ఎదుగుదల కోసం పాటుపడుతూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన పంచకర్ల రమేష్ బాబు రమేష్ ఆర్ఎస్ నాయుడును పెందుర్తి మార్కెట్ కమిటీ సభ్యుడిగా నియమించారు.

మహాలక్ష్మి నగర్ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి : ఐసిడిఎస్ పెందుర్తి సెక్టార్ పరిధిలో గల మహాలక్ష్మి నగర్ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి బుధవారం సూపర్వైజర్ గీతా లక్ష్మీ పర్యవేక్షణలో అంగన్వాడీ కార్యకర్త ఏ. సుజన, బాలింతలు గర్భిణీ స్త్రీలు చిన్నపిల్లలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించి తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలనే ఇవ్వాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా రాలీ నిర్వహించి తల్లిపాల గొప్పతనంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్పర్స్ పద్మ, అరుణ, ఏఎస్ఎం శ్రీలక్ష్మి ఆశా వర్కర్ ఎస్ పద్మ పాల్గొన్నారు.

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో

కూటమికి భారీ షాక్

50 ఓట్లతో వైసీపీ కార్పొరేటర్ పద్మారెడ్డి విజయం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం రాగానే కొంతమంది వైసీపీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేసి మేయర్ పీఠాన్ని దక్కించుకున్న కూటమి పార్టీలు స్థాయి సంఘంలో తమ పట్టును దక్కించుకోలేకపోయాయి. జనసేనకు ఒక్క స్థానం కూడా ఇవ్వకపోవడంపై ఆ పార్టీ కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఒకరు ఓటింగ్‌కే దూరమయ్యారు. మరొకరు ఓటింగ్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, రహస్య ఓటింగ్ విధానానికి తూట్లు పొడిచారని ఆరోపించారు. చివరికి పది స్థానాలకు 10 తమవే అని ధీమా వ్యక్తం చేసిన కూటమి పార్టీ నేతలు ఖంగుతిన్నారు. భారీగా క్రాస్ ఓటింగ్‌తో వైసీపీకి కూటమి కార్పొరేటర్లు ఓటు వేయడంతో 24 వార్డు వైసీపీ కార్పొరేటర్ సాడి పద్మా రెడ్డి గెలుపొందారు. పార్టీ ఫిరాయింపు కార్పొరేటర్లను ఓటింగ్‌కు వాడుకున్నా కూటమికి తప్పని భంగపాటు తప్పలేదని తేటతెల్లమైంది. మేయర్ పీలా శ్రీనివాస్ జరిగిన నష్టంపై సమీక్ష చేస్తామంటూ తప్పించుకునే దారుణంలో సమాధానం ఇచ్చారు.

కూటమి పాలనకు చెంప పెట్టు: కేకే రాజు

ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన కార్పొరేటర్లు వైసీపీకి మద్దతుగానే నిలుస్తున్నారని ఈ గెలుపే ఒక నిదర్శనమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కార్పొరేటర్లు ఇచ్చిన తీర్పు కూటమి పాలనకు చెంప పెట్టు అన్నారు. "గతంలో అడ్డగోలుగా మేయర్ పదవిని కూటమి కైవసం చేసుకుందని, బీసీ మహిళకు జగన్ అవకాశం ఇస్తే అడ్డదారిలో మహిళా మేయర్ ను దించేశారని, స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఎన్నడూ డబ్బుతో రాజకీయం చేయలేదన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూడా క్యాంప్ రాజకీయం చేశారని, మాకున్న బలం 32 మంది కార్పొరేటర్లు అని, వైఎస్సార్సీపీ తరపున పోటీ చేసిన అందరికీ 32 ఓట్ల కంటే అధికంగా వచ్చాయని రాజు తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ కార్పొరేటర్లు నేతలు జీవీఎంసీ కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకున్నారు. 50 ఓట్లతో ఒక స్టాండింగ్ కమిటీ సీట్ గెలిచామన్నారు. కూటమి కార్పొరేటర్లు కూడా మాకు ఓటు వేశారని, ఇప్పటికైనా చంద్రబాబు కళ్ళు తెరవాలన్నారు. గెలిచిన స్థానాన్ని ప్రకటించడానికి కూడా ఇబ్బంది పెట్టారని, వైసీపీ నుంచి బయటకు వెళ్లిన కార్పొరేటర్లు పశ్చాత్తాప పడి మాకు ఓట్లు వేసి ఉండచ్చునని, కూటమి భయభ్రాంతులకు గురి చేసినా పోటీ చేసిన వారికి అభినందనలు అని కేకే రాజు పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ కటమూరు సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్‌తోపాటు కార్పొరేటర్లు నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో రహస్య ఓటింగ్ విధానం ఉల్లంఘన

39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో రహస్య ఓటింగ్ విధానం ఉల్లంఘనపై 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో పోలింగ్ అనంతరం బయటికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ 10 మంది సభ్యులను ఎన్నుకోవడానికి జరిగిన ఈ ఎన్నికలు, ఓటరు గోప్యతను రాజీ చేసే ప్రక్రియాపరమైన లోపంతో సంక్లిష్టంగా మారాయన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ ఎన్నికను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాదిఖ్, ప్రిసైడింగ్ అధికారికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు సమర్పించారు, బ్యాలెట్ పేపర్లు, వాటి కౌంటర్‌ఫాయిల్స్ ఒకే సీరియల్ నంబర్‌ను కలిగి ఉన్నాయని, అంతేకాకుండా ఓటర్లు ఆ సీరియల్ నంబర్‌తో కూడిన కౌంటర్‌ఫాయిల్‌పై సంతకం చేయవలసి వచ్చిందని హైలైట్ చేశారు. ఈ పద్ధతి ఓటరు గుర్తింపును వారి ఓటుతో అనుసంధానించడాన్ని సాధ్యం చేస్తుంది, ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద రహస్య ఓటింగ్ విధానాన్ని ఉల్లంఘిస్తుందనీ అన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలను వెంటనే రద్దు చేయాలని , దీనిపై హైకోర్టులో కేసు కూడా వేస్తానని ఆయన తెలియజేశారు.

స్త్రీల కంటే పురుషులలో మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎక్కువ

విశాలాంధ్ర - విశాఖపట్నం: మధుమేహ వ్యాధిగ్రస్తులు స్త్రీల కంటే పురుషులలో ఎక్కువ మంది ఉన్నారని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ముఖ్యంగా పర్యావరణం, జీవనశైలి, జన్యుశాస్త్రం వలన కావచ్చు. అయితే, మహిళలతో పోలిస్తే పురుషులలో మధుమేహం ప్రమాదం ఎక్కువగా ఉందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయన్నారు. విసెరల్ కొవ్వు (ఉదర ప్రాంతంలో నిల్వ చేయబడిన కొవ్వు) ఎక్కువ మొత్తంలో ఉండటం వల్ల టైప్ 2 డయాబెటిస్ ప్రాబల్యం పురుషులలో 14.6 శాతం, మహిళల్లో 9.1 శాతం ఉందని ఒక అధ్యయనం చూపించిందన్నారు. డయాబెటిస్ ఉన్న తల్లి కంటే టైప్ 1 డయాబెటిస్ ఉన్న తండ్రులు వలన ఈ పరిస్థితి బిడ్డకు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉందని మరొక అధ్యయనం చెబుతోందన్నారు. తరచుగా దాహం వేయడం మరియు ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేయాలనే కోరిక, లైంగిక సామర్థ్యం తగ్గిపోవడం, అనుకోని విధంగా బరువు తగ్గడం, దృష్టిలో మార్పులు, అలసట, ఆకలి పెరుగుదల, నోరు పొడిబారడం, తలనొప్పి, చర్మం నల్లబడటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు.

అమెజాన్ డాట్ ఇన్‌లో రక్షాబంధన్ ప్రత్యేక స్టోర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: తమ ఇ గిఫ్ట్ కార్డ్స్ కోసం కొత్త వ్యక్తిగత ఫీచర్ అమేజాన్ పే డిజిటల్ అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు అమెజాన్ పే గిఫ్టింగ్ స్టోర్డ్ వేల్యూ డైరెక్టర్ జి.నేహా గుప్తా మహాత్మ వెల్లడించారు. తమ సొంత వ్యక్తిగత ఫోటోలు లేదా ఆర్ట్ వర్క్‌ను అప్ లోడింగ్ చేయడం ద్వారా గిఫ్ట్ కార్డ్స్‌ను వ్యక్తిగతం చేయడానికి ఈ ఫీచర్ కస్టమర్లకు అనుమతిస్తుందన్నారు. రాఖీ పురస్కరించుకొని అమెజాన్ డాట్ ఇన్ అన్ని పండగ అవసరాల కోసం ఏకైక వేదికగా రక్షా బంధన్ స్టోర్‌ను పరిచయం చేసిందన్నారు. అందంగా తయారు చేయబడిన రాఖీలు, సంప్రదాయబద్ధమైన మిఠాయిలు, ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్, ఇంకా ఎన్నో వాటిని ప్రదర్శిస్తున్న స్టోర్ షాపింగ్‌ను సులభంగా, ఆనందకరంగా చేయడానికి ఉత్తేజ భరితమైన డీల్స్, ఆఫర్లను అందిస్తోందన్నారు. విలాసవంతమైన అనుభవాన్ని చేర్చే సొగసైన ఎన్వలప్స్, ప్రీమియం బాక్సులు, డిజైనర్ గ్రీటింగ్ కార్డ్స్ సహా కొత్త ప్యాకేజింగ్ రూపాలతో అమెజాన్ తమ వాస్తవమైన బహుమతి ఎంపికలను మెరుగుపరిచింది. ఈ రక్షా బంధన్ కు, పర్యావరణ చైతన్యం కలిగిన కస్టమర్లు విలక్షణమైన విత్తనాలు కలిగిన పేపర్ బహుమతి కార్డ్‌ను ఎంచుకోవచ్చు అని చెప్పారు.

అందుబాటులోకి రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మ్యూజిక్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - విశాఖపట్నం: యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్ ఆధ్వర్యంలో అన్ని స్ట్రీమింగ్ ప్లాట్ ఫారంలలో రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మ్యూజికల్ కార్యక్రమం జరగనుందని గాయకుడు అర్మాన్ మలిక్ తెలిపారు. రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్, బ్రాండ్ వారి ఫ్లాగ్ షిప్ మ్యూజిక్ ఐపీ యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్ వారి సహకారంలో, రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ఒరిజినల్స్ క్రింద ఒక తాజా లైన్-అప్‌తో మరలా ముందుకు వచ్చిందన్నారు. ఇది మెలొడీని, హిప్-హాప్‌ను రంగరించే ఒక విలక్షణమైన ఫార్మాట్. పెహ్లా జైసీ బాత్ నహీ, హవాడీ, మొహబ్బత్, ఇమ్తిహాన్ వంటి విజయవంతమైన ట్రాక్స్ తర్వాత ఈ ప్లాట్ ఫారం ఇప్పుడు, ఈ సీజన్‌లో తన మూడవ ఒరిజినల్, మేబి అర్మాన్ మలిక్ మరియు ఇక్కాల శక్తివంతమైన కొలాబరేషన్‌ను ముందుకు తెస్తోందన్నారు.

నూతన మాగ్నెట్ కురో స్పెషల్ ఎడిషన్ ది బోల్డెస్ట్ బ్లాక్‌ను విడుదల చేసిన నిస్సాన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: నిస్సాన్ మోటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ ఎం ఐ పీ ఎల్), ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త నిస్సాన్ మాగ్నెట్ కురో స్పెషల్ ఎడిషన్‌ను నేడు విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా నిస్సాన్ ఇండియా మోటార్స్ డైరెక్టర్ సౌరబ్ వత్స మాట్లాడుతూ ఇది దాని ప్రసిద్ధ కాంపాక్ట్ ఎస్యువి యొక్క అద్భుతమైన, ప్రీమియం, బ్లాక్-థీమ్ వేరియంట్ రూ.8.30 లక్షల (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ) ప్రారంభ ధర కలిగిన కురో స్పెషల్ ఎడిషన్ బోల్డెస్ట్ బ్లాక్ ఫిలాసఫీతో అత్యంత ఆకర్షణీయమైన శైలి, సువేవ్ ఇంటీరియర్ బ్లాక్ థీమ్, జపనీస్ ఇన్స్పైర్డ్ డిజైన్ సూచనలను కలిగి ఉంటుందని చెప్పారు. కొత్త నిస్సాన్ మాగ్నెట్ కురో స్పెషల్ ఎడిషన్ ను సరసమైన రీతిలో కేవలం రూ. 11,000 చెల్లించి బుకింగ్ చేసుకోవటానికి అందుబాటులో ఉందన్నారు. కస్టమర్లు తమ వాహనాన్ని అధీకృత నిస్సాన్ మోటర్ ఇండియా డీలర్‌షిప్‌ల ద్వారా లేదా అధికారిక నిస్సాన్ మోటర్ ఇండియా వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ నిస్సాన్ డాట్ ఇన్ ను సందర్శించడం ద్వారా రిజర్వ్ చేసుకోవచ్చు అన్నారు.

ఎయిర్ పోర్టు పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎయిర్ పోర్టు పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలని, డ్రెయిన్ల ద్వారా మురుగు, వర్షపు నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో లారీ డ్రైడర్లు ఆహార పదార్థాలను ఎయిర్ పోర్టు గోడ సమీపంలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పక్షులు రావడానికి అవకాశాన్ని కల్పించరాదని సూచించారు. మేఘాద్రి గెడ్డ, ఇతర గెడ్డల్లో పూడికపోయిన చెత్తను క్రమం తప్పకుండా తొలగించాలని, ఎయిర్ పోర్టు పరిసరాల్లో నిర్మాణ సామగ్రి, చెత్తా చెదారం డంపింగ్ చేయరాదని పేర్కొన్నారు. అపరిశుభ్రత, ప్రమాద కారకాలైన ఎలాంటి కార్యకలాపాలు జరగ్గకుండా అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎయిర్ పోర్టు డైరెక్టర్ ఎన్. పురుషోత్తం మాట్లాడుతూ ఇటీవల కాలంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఎయిర్ పోర్టు, ఐఎన్ఎస్ డేగా పరిసరాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించామని, దానిలో భాగంగా పలు ఇబ్బందికర పరిస్థితులను గుర్తించామని వెల్లడించారు. ప్రధానంగా పరిసరాల్లో చెత్తా చెదారం వేస్తున్నారని, నిర్మాణ సామగ్రిని డంపింగ్ చేస్తున్నారని చెప్పారు. జ్ఞానాపురం, పోర్టు సమీపంలోని డ్రెయిన్ల పూడిక తొలగించలేదని, ట్రక్ పార్కింగ్ సమీపంలో డ్రైవర్లు ఆహార పదార్థాలను పడేస్తున్నారని తెలిపారు. ఎయిర్ పోర్టు లోపల ఉన్న నీటి కుంటల వద్ద పక్షుల చేరకుండా చర్యలు చేపట్టాల్సి ఉందని, పూడిక, పిచ్చి మొక్కలను తొలగించాల్సి ఉందని తెలిపారు. ఎయిర్ పోర్టు అథారిటీ, విశాఖపట్టణం పోర్టు, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో వైసీపీకి ఎదురుదెబ్బ

పాలవలస ఎంపీటీసీతో సహా 400 మంది టిడిపిలో చేరిక

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వైఎస్సార్సీపీకి గండిగుండం గ్రామం నుంచి బలమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆ గ్రామానికి చెందిన మాజీ వైసీపీ అధ్యక్షుడు మదపాడ శ్రీను తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పాలవలస ఎంపీటీసీ రౌతు శ్యామల వెంకట్రావు, తన సహచరులతో సుమారు 200 మంది ఈ చేరిక భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ సీనియర్ నేతలు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, సోంబాబు, రమేష్ ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయిలో ఉన్న నాయకులు కూడా టీడీపీలోకి చేరారు. వీరిలో పాలవలస ఎంపీటీసీ రౌతు శ్యామల, వెంకట్రావు, ఉప సర్పంచ్ చందక ఎల్లారావు, వార్డు సభ్యురాలు నిమ్మల లక్ష్మీ, రౌతు వెంకట్రావు, కంచుబోయిన తమ్మినాయుడు, రౌతు పెద వెంకట్రావు, మామిడి ఉదయ్ శంకర్, ఈగల అప్పలనాయుడు, ముద్దాడ సన్యాసిరావు, అలమండ రమణ సుమారు 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గండిగుండం గ్రామం నుంచి మాజీ సర్పంచ్ పెంటకోట అప్పలనాయుడు, ఉప సర్పంచ్ సరగడ అప్పారావు, వార్డు సభ్యులు ఎద్దు రాము, లావేటి పోలయ్య, బంటు చిన్నబాబు, పొట్నూరు పైడయ్య, నిమ్మకాయల గురుమూర్తి, కరకాన సత్తిబాబు, గోరపల్లి ఈశ్వరరావు, ఇల్లపు అచ్చం నాయుడు, ఎలుగుబంటి సోంబాబు, కృష్ణ, దుర్గారావు లాంటి సుమారు 400 మంది కీలక నేతలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మదపాడ శ్రీను మాట్లాడుతూ "భీమిలి నియోజకవర్గం గంటా శ్రీనివాసరావు గారి నేతృత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

వైసీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా కోరాడ

విశాలాంధ్ర - ఆనందపురం: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఆనందపురం మండల అధ్యక్షుడిగా కోరాడ ఆదినారాయణ నియమితులయ్యారు. తర్లువాడ గ్రామానికి చెందిన ఆదినారాయణ యువ నాయకుడిగా, స్వచ్ఛంద సేవకుడిగా పేరు పొందారు. పార్టీ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపట్టిన ఆదినారాయణను, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త, వైసిపి నాయకులు ఆదినారాయణ ను ఈ పదవికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, వైయస్సార్ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి గంధ్రెడ్డి శ్రీనివాసరావు, తదితరులు అభినందనలు తెలిపారు.